క్లుప్తంగా

నేడు ఉచిత మెగా డయాబెటిస్ శిబిరం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రతి నెల రెండో శనివారం ఉచిత మెగా డయాబెటిస్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ పి.శ్రీనివాస్, మేనేజింగ్ డైరెక్టర్ నీలిమలు పేర్కొన్నారు. మోతీనగర్ హనుమాన్ దేవాలయం దేవాలయం వద్ద ఉదయం 7గంట నుంచి 10గంటల వరకు డయాబెటిస్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

పోలీసులకు ధన్యవాదాలు



సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మోతీనగర్: హనుమాన్ శోభాయాత్రకు సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి శుక్రవారం శోభాయాత్ర నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్, సిబ్బందిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌గౌడ్, సుదర్శన్ ముదిరాజ్, జలంధర్, గంగాధర్, కృష్ణంరాజు, కృష్ణశర్మ, శ్రవణ్, జీతూ, అంకిత్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

జగద్గిరిగుట్ట: ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్నామని దీనిని జయప్రదం చేయాలని కుత్బుల్లాపూర్ ఏఐటీయూసీ అనుబంధ సంస్థ, స్టోన్ లేయింగ్ వర్కర్స్ యూనియన్ తెలిపింది. శుక్రవారం శ్రీనివాస్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయిలు, మజీద్ అధ్యక్షతన ఈ సమావేశ జరిగింది. ముఖ్యఅతిథులుగా ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్‌రావు, మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు రాములు హాజరై మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో ప్రజలు బతికే పరిస్థితి లేదన్నారు. దీనికి కారణమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటు చేసి ఎర్రదండు కదం తొక్కాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జహంగీర్, సజీర్ ఆలీ, కమరొద్దీన్, నజీర్, సాయిబాబా, సిరాజ్, ఇర్ఫాన్, చాంద్ పాషా, ఖాజా, మహమూద్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ పాఠశాల పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని రమ్యాగ్రౌండ్‌లో నిర్మిస్తున్న నందమూరి తారక రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనులను శుక్రవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంతో మందికి మార్గదర్శకులైన నందమూరి తారకరామారావు పేరుతో సొంత నిధులతో ఈ పాఠశాల నిర్మించడం తన పూర్వజన్మ సుకృతమని అన్నారు. అందుకు పూర్తి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే కృష్ణారావుకు ఎంతో రుణపడి ఉంటానని తెలిపారు. అతి త్వరలో ఈ పాఠశాల నిర్మాణం పూర్తి చేసుకొని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులో తెచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవిరెడ్డి, మెహబూబ్, రాంబాబునాయుడు, గఫూర్, అంజిరెడ్డి, ఆది, రామరాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

మాదాపూర్: ప్రకృతితో కలిసి జీవించినప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని మెడికవర్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కృష్ణ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ హాస్పిటల్‌లో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం లాగా మట్టికుండలో వంట చేయడం, చేతులతో తినడం, మజ్జిగ అన్నం తినడం, ఇంట్లోకి ప్రవేశించే ముందు పాదరక్షలు బయట ఉంచడం, త్వరగా రాత్రి భోజనం చేయడం, పొద్దున్నే లేవడం వంటి భారతీయ సాంప్రదాయ పద్ధతులను మనం అనుసరించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పూర్తయ్యేదెన్నడు?

- మూసాపేటలోని మున్సిపల్ కార్యాలయం రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్
- అసలే చిన్న రోడ్డు దాని మధ్య డివైడర్ ఏర్పాటు
- తోపుడుబండ్లు పెట్టడంతో మరింత కుంచించుకుయిన రోడ్డు
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులకు చుక్కలే..



తోపుడు బండ్లు పెట్టుకోవటంతో మరింత కుంచించుకుపోయిన రోడ్డు

మూసాపేట: మూసాపేటలో ఇప్పటికే ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ పనులు కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పనులు మాత్రం జరగటం లేదు. మూసాపేట పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. దీనికి తోడు అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఈ ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారింది. మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారికి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయటంతో రోడ్డు మరింత తగ్గిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మూసాపేట మీదుగా ప్రయాణం సాగించాలంటే అమ్మో! మూసాపేట అంటూ బెంబేలెత్తుతున్నారు.

◆ మూసాపేట చౌరస్తా నుంచి ఆంజనేయనగర్ చౌరస్తా వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులను కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తూనే ఉన్నాయి. కొన్ని చోట్ల రోడ్డు విస్తరణ పనులు చేయటంతో ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వాటికి గ్రిల్స్ కూడా ఏర్పాటు చేశారు. కొన్ని రోజులకు ఆ గ్రిల్స్ తీసివేశారు. ప్రస్తుతం రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ మరింత సమస్యగా మరింది.

◆ మున్సిపల్ కార్యాలయం వద్ద చిత్తారమ్మ తల్లి ఆలయం వరకు ఫుట్‌పాత్ నిర్మించారు. ఫుట్‌పాత్‌ను దాటి రోడ్డుపై చిరువ్యాపారులు సాయంత్రం వేళలో తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నారు.

◆ గతంలో ఇక్కడ ఫుట్‌పాత్ దాటి తోపుడు బండ్లు పెట్టడంతో అక్కడకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను కూడా అక్కడే పార్కింగ్ చేయటం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడేది. ప్రస్తుతం రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయటంతో రోడ్డు మరింత చిన్నదిగా అయిపోయింది.

◆ ప్రస్తుతం ఫుట్‌పాత్ గ్రిల్స్ తొలగించినప్పటికి ఫుట్‌పాత్ దాటి తోపుడు బండ్లు మరింత ముందుకు పెట్టడమే కాక ఫుట్‌పాత్‌లను కూడా వారే వినియోగించుకుంటున్నారు. అక్కడకు వచ్చే వినియోగదారుల వాహనాలు ఈ తోపుడు బండ్లు ముందు పార్కింగ్ చేయటంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందిగా ఉంది.

◆ కైత్లాపూర్ వద్ద బ్రిడ్జిని నిర్మించటంతో అయ్యప్ప సొసైటీ, గచ్చిబౌలి, సైబర్‌సిటీకి వెళ్లే ప్రజలు కూకట్‌పల్లి నుంచి కాకుండా మూసాపేట నుంచే రాకపోకలు కొనసాగిస్తుంటారు. దీంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వచ్చే వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కారణంతో ద్విచక్ర వాహనదారులు బస్తీ గుండా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

◆ అయితే డివైడర్‌లు ఏర్పాటు చేసినప్పటికి అస్తవ్యస్తంగా వెళ్తూ ప్రమాదాలను కొని తెచ్చుకోకుండా అడ్డుకున్నారే కానీ ట్రాఫిక్ సమస్యను మాత్రం పట్టించుకోలేదని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

◆ ఫుట్‌పాత్‌లను తగ్గించి తోపుడు బండ్లను ఖాళీ ఉన్న ప్రదేశంలో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవటమే కాక వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తే బాగుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది..



నిత్యం సాయంత్రం వేళల్లో రద్దీగా ఉండే ప్రాంతం కావటంతో ఫుట్‌పాత్ ఏర్పాటు చేయటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. గతంలోనే ఫుట్‌పాత్‌ల వల్ల ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతుండే ప్రస్తుతం డివైడర్లు ఏర్పాటు చేయటంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టాలి.

– పాతపల్లి శివశంకర్, మూసాపేట

బీజేపీ బలం బలగం ఏంటో చూపిస్తాం

- కూకట్‌పల్లి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు
- నేడు జరగనున్న ప్రధాని మోదీ సభకు తరలిరండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: పరీక్ష పేపర్ లీకుల విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాత్ర ఉందంటూ ఆయనను అక్రమ అరెస్టు చేయటం... అరెస్టు అనంతరం సుదీర్ఘ రాజకీయ పరిణామాల మధ్య బీజేపీ లీగల్ సెల్ వాదనలతో ఏకీభవించిన కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసిందని మాధవరం కాంతారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మాట్లాడారు. న్యాయస్థానం బండి సంజయ్‌కి బెయిల్ మంజూరు చేయటం ప్రజాస్వామ్య విజయమన్నారు. కేసీఆర్ డైరెక్షన్‌లో ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసినా.. ఎన్ని చిల్లర రాజకీయాలు చేసినా చివరకు ధర్మమే విజయం సాధించిందన్నారు. బీజేపీ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేని ప్రభుత్వం బీజేపీ నాయకత్వంపై పసలేని విమర్శలు చేస్తూ అక్రమ కేసులతో వేధించాలని చూస్తోందన్నారు.

◆ టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పత్రాల లీక్‌పై రాష్ట్ర మంత్రి వర్గంలోని ఏ ఒక్క మంత్రి కూడా మాట్లాడని వారు ఇప్పుడు నిరాధారమైన, సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలన్నారు. నష్టపోయిన అభ్యర్థులకు లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్రానికి సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. అదే విధంగా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ రాబోతున్నారని ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. బీజేపీ బలం, బలగం ఏమిటో కేసీఆర్ కుటుంబానికి మరోసారి చూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యరావు, సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలి



శ్రీతులసీనగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న గది నిర్మాణం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ శ్రీతులసీనగర్ శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న సర్వే నం.336లోని ప్రభుత్వ భూమిలో ఉన్న సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని కొందరు ఓ గదిని నిర్మించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఇదే స్థలంలో స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు మహిళా భవనం కోసం కేటాయించి భవన నిర్మాణం చేపట్టాలని గతంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేరని తెలిపారు. స్థలం కబ్జా విషయాన్ని శుక్రవారం మహిళలు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. సుమారు కోటి రూపాయల విలువైన స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక మహిళలు మండల అధికారులు, కూకట్‌పల్లి మండల తహసీల్దార్ గోవర్ధన్‌లకు ఫోన్‌లో విషయాన్ని తెలిపారు. వెంటనే స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని నేలమట్టం చేసి ప్రజావసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో అభివృద్ధి లేదు



గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పాదయాత్ర కొనసాగుతోంది. మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లూరి రామరాజు, సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి, కుమార్‌యదవ్, రవీందర్‌రావు, మణిభూషణ్, కమలాకర్‌రెడ్డి, వేణుయాదవ్, నర్సింగ్‌యాదవ్, నరసింహాచారి, రాజు, రఘుల ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సిక్కుల బస్తీ, పీజేఆర్‌నగర్‌లలో శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడంలో ముందు, సమస్యలు తీర్చడంలో వెనక అన్నట్లు ఉందన్నారు. ప్రతి వీధిలో.. ప్రతి వాడలో చెత్తాచెదారం పేరుకుపోయి, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయే తప్ప ఎక్కడా అభివృద్ధి కనిపించటం లేదన్నారు. ప్రతి వీదిలో కుక్కల వీరంగంతో ప్రజలు వణికిపోతున్నారని పేర్కొన్నారు. వీధి కుక్కలపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని వాటిపై దృష్టి సారిస్తామని తెలిపారు.

ఉచిత దంత వైద్యశిబిరం

హఫీజ్‌పేట్ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకొని శుక్రవారం మియాపూర్ మాతృశ్రీనగర్‌లోని పోతుకూచి సోమ సుందరం సామాజిక సేవా సంస్థలోని విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. చందానగర్‌లోని స్మిత దంత వైద్యశాల డా.శ్రీధర్‌రెడ్డి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం ఉండాలంటే నిత్యం నడక, వ్యాయామం, ధ్యానం, సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు పండ్లు, తృణధాన్యాలు తీసుకోవడం వలన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు, అసోసియేషన్ సభ్యులు మల్లేష్, వాణి సాంబశివ రావు, డాక్టర్ కౌశిక్, పాలం శ్రీను, విష్ణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో అంజయ్యనగర్‌లోని కట్ట మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ దేవాలయ 7వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ పూజలకు కార్పొరేటర్ జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

అమీర్‌పేట: ప్రభుత్వ ఆస్పత్రులు ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెల్లాల రామ్మోహన్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాయల సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం అమీర్‌పేటలోని 50 పడకల ఆస్పత్రిలో రోగులకు పండ్లు, మజ్జిగ, నాలుగు రకాల హార్లిక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ... నూతనంగా నిర్మించిన ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, వార్డుల నిర్వాహణ అద్వితీయంగా ఉందన్నారు. సేవా సమితి వ్యవస్థాపకుడు ఆర్.సి.కుమార్ మాట్లాడుతూ... పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు నిత్యం కొద్దిపాటి వ్యాయామం చేయాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ దశరథ్, డాక్టర్ వినాయక్, సేవా సమితం ప్రతినిధులు అద్దంకి హేమలత, విజయశ్రీ, మోర్ల అమరేశ్వరి, నాగరేఖ పాల్గొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీకి కంప్యూటర్ ల్యాబ్



ఎన్‌జీఓ ప్రతినిధులతో ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీకి మహర్దశ పట్టింది. శుక్రవారం అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక కంప్యూటర్‌ల ల్యాబ్‌ను ప్రారంభించారు. కళాశాల అభివృద్ధికి దేశ విదేశాల్లో ఉన్న పూర్వవిద్యార్థులు అధికంగా సహాయం అందిస్తున్న విషయం విధితమే. పది రోజుల క్రితం కోల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ అధికారులైన పూర్వవిద్యార్థులు కొత్తగా స్థాపించిన మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది వేతనాలకు విరాళంగా రూ.3 కోట్లను డిపాజిట్ చేసిన విషయం విధితమే. పూర్వ విద్యార్థులతో పాటు అమెరికాకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థకు దరఖాస్తు చేసుకోగా సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. అమెరికాకు చెందిన ఎస్ అండ్ పీ గ్లోబల్ కంపెనీ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ (యూడబ్ల్యూ హెచ్) అనే అంతర్జాతీయ ఎన్‌జీఓ ద్వారా ఇంజినీరింగ్ కాలేజీకి 76 అత్యాధునిక 13 జనరేషన్ కంప్యూటర్లతో పాటు 48 బ్యాటరీలు, 2 యూపీఎస్, 2 వీడియో కాన్ఫరెన్స్ కిట్లు స్మార్ట్ బోర్డులు, ఇంజినీరింగ్ 41 మంది విద్యార్థినులకు ఫెలోషిప్‌లను అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మియాపూర్: ఫ్లైఓవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు. బీహెచ్‌ఇఎల్ చౌరస్తాలో రూ.130.65 కోట్ల రూపాయలతో చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అదే విధంగా సర్వీస్ రోడ్డు పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సర్వీస్ రోడ్డులో వ్యాపార సముదాయాల ముందు తీసిన గుంతలకు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ రామకృష్ణ, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత...

మియాపూర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన కె.గిరిజకు ముఖ్యమంత్రి సహాయనిధి రూ. 2 లక్షల 50 వేల రూపాయాల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు.

'నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయారు'



మగ్దూమ్‌నగర్‌లో కరపత్రాలను అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

జగద్గిరిగుట్ట: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూమ్‌నగర్‌లో ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసిన హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిత్యవసరాల ధరలను తగ్గించడంతో పాటు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజల కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు గణేష్, శ్రీనివాస్‌చారి, వీరారెడ్డి, అంజిరెడ్డి, జేమ్స్, సిద్దినోళ్ల సంజీవరెడ్డి, పండిరావు, వేణు, గురుమూర్తి తదితరులు ఉన్నారు.

ధరణినగర్ మసీదులో ముస్లింలకు కానుకలు

అల్విన్‌కాలనీ: ధరణినగర్‌లోని మసీదులో శుక్రవారం రంజాన్ కానుకలను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముస్లింలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రంజాన్ మాసం చాలా పవిత్రమైందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద మనస్సుతో రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు సంజీవరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, జిల్లా గణేష్, దొడ్ల రామకృష్ణగౌడ్, కాశీనాథ్‌యాదవ్, షౌకత్‌అలీ మున్నా, కైసర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ మాసం సందర్భంగా బట్టలను పంపిణీ చేసిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

రంజాన్ మాసం.. భక్తిశ్రద్ధలతో ఉపవాసం

ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేకు పండ్లు తినిపిస్తున్న ముస్లింలు

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని వల్లభ్ నగర్ ఈద్గాలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, నాయకులు సయ్యద్ ఏజాజ్, ఖదీర్, జహంగీర్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం ఉపవాసంలో ఉన్న ముస్లింలకు ఖర్జూరం పండు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రంజాన్ మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, గడ్డం నర్సింగ్‌రావు, పోచయ్య, హరినాథ్, రాజుగౌడ్, పిట్లరాజు తదితరులు పాల్గొన్నారు. – ఓల్డ్‌బోయిన్‌పల్లి: